పైకస్ పార్కు పునరుజ్జీవానికి అడుగులు

- మునిసిపల్ నిర్లక్ష్యంతో తూట్లు పడిన లక్ష్యం
- నిధుల కొరతతో ఆగిపోయిన అభివృద్ధి
- పార్కును పరిశీలించి, అభివృద్ధికి ఆదేశాలు జారీ చేసిన ఎమ్మెల్యే అన్నాబత్తుని



పైకస్ పార్కును మున్సిపల్ అధికారులతో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఆంధ్రా పారిస్ తెనాలిలో దక్షిణ భారతదేశంలోనే మరెక్కడా లేనటువంటి అరుదైన పైకస్ పార్కుకు మునిసిపాలిటీ నిధుల లేమితో గ్రహణం పట్టింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన పైకస్ జాతుల మొక్కలతో ఏర్పాటు చేసిన పార్కు అభివృద్ధి ఆగిపోయింది. ఇతర హంగుల కల్పనకు బ్రేక్ పడింది. కనీస నిర్వహణ కూడా లేకుండా పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కెనాల్ బండ్‌ను తీర్చిదిద్దుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పైకస్ పార్కు పునరుజ్జీవంపై దృష్టిపెట్టారు. కెనాల్ బండ్‌పై మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ నాటికి ఈ పార్కును కూడా సందర్శకులకు అందుబాటులో తేవాలని సంకల్పించారు.

మూడు ఎకరాల్లో..

ఆంధ్రప్రదేశ్ గ్రీనరీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రమోహనరెడ్డి ఆలోచనల నుంచి పైకస్ పార్కు తెనాలిలో సాకారమైంది. పట్టణానికి ఉత్తరం వైపున విజయవాడ రహదారి పక్కన తూర్పు కాలువ అంచున గల మునిసిపల్ మంచినీటి పథకం హెడ్ వాటర్ వర్క్స్ వద్ద సువిశాలమైన 3 ఎకరాల స్థలం, నీటి లభ్యతతో పైకస్ పార్కుకు అంకురార్పణ చేశారు. కేంద్ర ప్రభుత్వ అమృత పథకం, మునిసిపాలిటీ సంయుక్తంగా దీనిని నిర్వహిస్తున్నారు. ఏపీ గ్రీన్ కార్పొరేషన్ తగిన మొక్కలను ఎంచుకుని మునిసిపాలిటీకి అందజేస్తుంది. వాటిని నాటించి, సంరక్షించటం మునిసిపాలిటీ బాధ్యతగా 2018–19లో పార్కు రూపకల్పనకు శ్రీకారం చుట్టారు.

పైకస్ మొక్కలు అంటే..

పైకస్ అంటే మర్రి జాతుల మొక్కలని అర్థం. రావి, మర్రి, జువ్వి, మేడి...తదితర రకాల మొక్కలతో కూడిన పార్కు ఇది. పైకస్ జాతి మొక్కలు దేశవ్యాప్తంగా విస్తారంగా ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం 17 రకాలు మాత్రమే ఉన్నాయని అంచనా. ఈ కొరతను నివారించి, కనీసం 100 రకాల పైకస్ జాతి మొక్కలను ఒకేచోట పెంచాలనేది ఈ పార్కు లక్ష్యం. తొలుత 20 రకాల మొక్కలను నాటారు. వీటిలో 40 ఏళ్ల వయసు కలిగిన రెండు మర్రి వృక్షాలను తెనాలి పరిసరాల నుంచి యంత్రాలతో ట్రాన్స్‌లోకేషన్ చేసి పార్కులో నాటించారు. ఎక్కువ వయసు కలిగిన బోన్సాయ్ (మరుగుజ్జు) వృక్షాలు, పైకస్‌లోనే ఇతర జాతుల మొక్కలు తెప్పించారు.

ఆహ్లాద వాతావరణానికి 'ప్లాన్'

సందర్శకుల కోసమని 'స్టాండ్ స్టోన్ గజబోస్'గా పిలిచే గోపురం తరహా కుటీర నిర్మాణాలను రాజస్థాన్ వర్కర్లతో ప్రారంభించారు. పార్కులో క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్, షటిల్ కోర్టు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా జిమ్, ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను నిర్మించాలని ప్లానులో చేర్చారు. పార్కు మధ్యలో వేదిక ఉండి, చుట్టూ ప్రేక్షకులు కూర్చునే గ్యాలరీతో ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉంటుంది. చిన్న పిల్లల పుట్టిన రోజు, ఇతర రకాల ఫంక్షన్లకు అనువుగా దీనిని డిజైన్ చేశారు. పైకస్‌పై పరిశోధకుల దగ్గర్నుంచి, భావి పౌరులకు ఆసక్తిని కలిగించేలా ఆయా మొక్కలను లేబిలింగ్ చేస్తామని చెప్పారు. తర్వాతికాలంలో నిధుల కొరత, అధికారుల ఉదాసీనతతో పైకస్ పార్కు అంతటితోనే ఆగిపోయింది. తెనాలిలో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న కెనాల్ బండ్‌కు అనుబంధంగా ఈ పార్కును సందర్శకులకు అనువుగా తీర్చిదిద్దే పనిలో ఎమ్మెల్యే శివకుమార్ కృషి చేస్తున్నారు. మునిసిపల్ అధికారులతో కలిసి సోమవారం పార్కును పరిశీలించారు. అవసరమైన ఆదేశాలను జారీచేశారు.

పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



సమస్యలు తెలుసుకుంటున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే సహించేది లేదని, పద్ధతి మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక హెచ్చరించారు. 12వ వార్డులో సోమవారం ఉదయం ఆమె పర్యటించారు. మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదని, పారిశుద్ధ్య నిర్వహణ పనులు ప్రతిరోజు జరగడం లేదని స్థానికులు ఆమెకు ఫిర్యాదు చేశారు. వార్డులో ఎక్కువ మంది ఫిర్యాదు చేయడంతో ఆమె అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 12వ వార్డులో ఎందుకు ప్రతిరోజు పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేయడం లేదని ప్రశ్నించారు. మరోసారి ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతిరోజు వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నట్లు చెప్పారు. ఆమె వెంట కౌన్సిలర్ కొర్ర యశోద, భట్టరాజు కార్పొరేషన్ డైరెక్టర్ రాళ్లబండి సుష్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ దావులూరి శ్రీనివాసరావు, వివిధ విభాగాల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



తెనాలిఅర్బన్: ప్రజలకు మంచి చేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం పేర్కొన్నారు. 9వ వార్డు లక్ష్మీనగర్ కాలనీలోని సచివాలయంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని చెప్పారు. పేద ప్రజల సంక్షేమం కోసం నవరత్న కార్యక్రమాలను రూపకల్పన చేసి అమలు చేశారని, వివరించారు. పథకాల ద్వారా పేదల జీవన విధానంలో మార్పు వచ్చిందన్నారు. 9వ వార్డు పార్టీ నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ తమ వార్డులో ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.13.4కోట్ల సంక్షేమ పథకాలను అందించినట్లు వెల్లడించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. సచివాలయంలో లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వైఎస్సార్ సీపీ వార్డు నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 37వ వార్డు భవనం వారి వీధిలోని సచివాలయం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 37వ వార్డులో ఇప్పటి వరకు రూ.21.56కోట్ల లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారుల బోర్డులను, జగన్ ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు అవసరం అనే బుక్‌లెట్‌ను చైర్‌పర్సన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, మల్లిబోయిన సువర్ణరేఖాదేవి, మేనేజర్ అప్పలరాజు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బాటలో పయనించండి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



సెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్



క్రైస్తవ గీతాలకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు

తెనాలిఅర్బన్: ఏసుక్రీస్తు బాటలో ప్రతి ఒక్కరూ పయనించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 28వ వార్డు సుల్తానాబాద్‌లో మార్త గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక రక్షకుడు ఏసుక్రీస్తు అని, ఆయన బోధించిన శాంతి, అహింసను అందరూ అలవర్చుకోవాలని సూచించారు. ముందుగా క్రిస్మస్ సందేశాన్ని ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ సుధీర్‌కుమార్ అందించారు. అనంతరం కేక్ ఎమ్మెల్యే శివకుమార్ కట్ చేసి, అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థునుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ యనమల ఈశ్వర్, కౌన్సిలర్లు దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకుల అక్కిదాసు కిరణ్‌కుమార్, పెరికల గిద్యోన్, కమలకర ప్రసాద్, ఆదిలక్ష్మి, నళిని, హనుమ, రాజేష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్టార్ ఇన్ ఏ మేనేజర్ సెట్ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు నాలాది ప్రభాకర్ ఆధ్వర్యంలో క్రిస్మస్ పండగను పురస్కరించుకుని జయప్రకాష్ నగర్‌లో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన స్టార్ ఇన్ ఏ మేనేజర్ సెట్‌ను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది క్రిస్మస్ నెలలో క్రీస్తు పుట్టుకకు సాదృశ్యంగా భావించే సెట్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది క్రీస్తు పుట్టిన పశువుల పాక స్టార్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కౌన్సిలర్లు గెద్దేటి ఝాన్సీవాణి, మట్లపూడి సంధ్యారాణి, షేక్ దుబాయ్‌బాబు, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు చారిత్రాత్మకం

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



వీడియో కాన్ఫరెన్సులో ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక, అధికారులు

తెనాలి: ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య చికిత్సల పరిమితిని రూ.25 లక్షలకు పెంచుతూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. దేశ చరిత్రలో తొలిసారిగా వైద్య రంగంలో సువర్ణ అధ్యాయాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి 25 లక్షలకు పెంపుదల చేస్తూ.. సీఎం వైఎస్ జగన్ సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాల్లోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల నుద్దేశించి మాట్లాడారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ ఎం.జస్వంతరావు, వైద్య, ఆరోగ్య అధికారులు, సిబ్బందితో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆరోగ్య సమస్యలను అధిగమించి, మెరుగైన జీవితాన్ని గడిపేందుకు దోహదం కాగలదని అభిప్రాయపడ్డారు. డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిన ముఖ్యమంత్రికి నియోజకవర్గ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని సజావుగా చేస్తూ, ప్రజలందరి దృష్టికి ఆరోగ్యశ్రీ పరిమితి పెంపుదలపై వివరిస్తామని స్పష్టంచేశారు. అవసరమైన ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా కృషిచేస్తామన్నారు.

జర్నలిస్టుల బతుకుచిత్రం 'సెటిల్‌మెంట్'



తెనాలి: ఫోర్త్ ఏస్టేట్‌గా పిలుచుకుంటున్న మీడియాలో జీవిస్తున్న జర్నలిస్టుల బతుకుచిత్రంపై 'సెటిల్‌మెంట్' టైటిల్‌తో సినిమాకు సన్నాహాల్లో ఉన్నట్టు సినీ దర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ సోమవారం తెనాలిలో విలేకరులకు తెలియజేశారు. జర్నలిస్ట్ జర్నీ అనే ట్యాగ్‌తో తీస్తున్న సినిమా ఓ కలం కథ. .కాలచక్రంలో కనిపిస్తున్న విలేకరి మానసిక వ్యథకు ప్రతిరూపంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లోకేషన్లను ఉచితంగా ఇస్తుండటంతో స్వస్థలమైన తెనాలి, గుంటూరు పరిసరాల్లోనే జనవరిలో చిత్రీకరిస్తామని చెప్పారు. బ్లాక్ అండ్ వైట్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై ముంబయికి చెందిన ఎస్‌వీఎస్ ఫిలిమ్ ఫ్యాక్టరీ చేస్తున్న 'సెటిల్‌మెంట్' చిత్రంలో అందరూ కొత్తవాళ్లే నటిస్తారని చెప్పారు. టాలెంట్ ఉన్న నటీనటులను ఎంపిక చేస్తున్నట్టు తెలియజేశారు. శ్రీనివాస్‌యాదవ్ స్వస్థలం తెనాలి సమీపంలోని మోపర్రు. హైదరాబాద్‌లో ఉంటూ టీవీ సీరియల్స్, ప్రకటన రంగంలో దర్శకుడిగా కొనసాగుతున్నారు. 'ఫ్రెండ్స్ కాలనీ' సినిమాతో సినీ దర్శకుడయ్యారు.

శ్రీ విద్యాపీఠంలో ధనుర్మాస మహోత్సవాలు



తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలిగ్రామ మఠం ఆధ్వర్యంలో బాలస్వామిజీ పర్యవేక్షణలో ధనుర్మాస మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉదయం తిరుమంజనంలో భాగంగా శ్రీకృష్ణ గోదా అష్టోత్రాలు నిర్వహించారు. ఉభయ దాతలు ఎం.రమణయ్య, సాంబ్రాజ్యం దంపతులు పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మఠం సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, కుమారి, రమాదేవి, కాంతమ్మ, జయలక్ష్మి మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

తెనాలిరూరల్: వ్యసనాలకు బానిసై చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు సోమవారం వివరాలు వెల్లడించారు. పట్టణ అమరావతి ప్లాట్స్‌కు చెందిన గుండవరపు సాయిప్రసాద్ అక్టోబర్ 22న తెనాలి జిల్లా వైద్యశాల రోడ్డులో నడుచుకుంటూ వెళ్తుండగా.. అతనిని గుర్తుతెలియని వ్యక్తి అడ్డగించి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లాడు. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో నిందితుడిని తెనాలి ఇస్లాంపేటకు చెందిన తిరుమలశెట్టి ఏసు కల్యాణ్ అలియాస్ కల్యాణ్‌గా గుర్తించారు. నిందితుడి ఆచూకీ కోసం ప్రయత్నిస్తుండగా ఆదివారం ఉదయం వీఎస్సార్ కళాశాల వద్ద గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తమ శైలిలో విచారించగా మారీసుపేట అప్పలస్వామి గుడివద్ద, రైల్వే స్టేషన్ వద్ద రెండు బైక్‌లను చోరీ చేసినట్లు చెప్పడంతో.. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచినట్లు సీఐ వివరించారు. నిందితుడిని అగుర్తించి సొత్తు రికవరీ చేసిన ఏఎస్ఐ బి.రమేష్‌బాబు, అంకయ్య, మురళీని ఆయన అభినందించారు.

26న డాక్ అదాలత్

తెనాలి: విజయవాడలోని పోస్టల్ రీజియన్ కేంద్రం ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 26వ తెనాలిలోని పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నారు. తపాల సేవలు పొందటంలో ఏవైనా ఫిర్యాదులు ఉన్నట్లయితే 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్‌ను కార్యాలయంలో సంప్రదించాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు. హాజరు కాలేని వారు 22వ తేదీలోగా తమ ఫిర్యాదులను పోస్టల్ ద్వారా ది సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ ఆఫీసెస్, తెనాలి డివిజన్, తెనాలి–522 201 చిరునామాకు పంపాలని, కవరుపై డాక్ అదాలత్ అని రాయాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న కృష్ణస్వామి

తెనాలిటౌన్: ఎరుకలపూడి గ్రామంలోని బాల శివసుబ్రమణ్యస్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, పూజలను ఆలయ అర్చకులు గోపరాజు హేమంత్ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. కృష్ణస్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యదర్శి టీఎస్.చక్రవర్తి పర్యవేక్షించారు.

సైన్స్‌పై ఆసక్తి పెంపొందించుకోవాలి



నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మీనారాయణ

తెనాలిఅర్బన్: సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తిని పెంపొందించుకోవాలని మండల విద్యాశాఖాధికారి మేకల లక్ష్మీనారాయణ అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తపేటలోని బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రయోగ నమూనాలను ప్రదర్శించారు. మండల స్థాయిలో మూడు ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి, జిల్లా ఎగ్జిబిషన్‌కు పంపనున్నట్లు ఎంఈఓ తెలిపారు. సుమారు 50 నమూనాలు ఇక్కడ ప్రదర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 జయంతిబాబు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఎంఆర్పీలు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలి

కొల్లిపర: ప్రతి విద్యార్థి బాగా చదివి శాస్త్రవేత్తగా ఎదగాలని ఎంఈవోలు సాల్మన్‌రాజ్, ఝాన్సీలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతి విద్యార్థుల మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ జరిగింది. తూములూరు, అత్తోట, మున్నంగి, వల్లభాపురం, కొల్లిపర ఉన్నత పాఠశాలల విద్యార్థులు తమ సైన్స్ ప్రయోగ నమూనాలను ప్రదర్శించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవోలు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, మృత్యుంజయరావు, స్వరూప, సీఆర్పీలు పిడపర్తి రమేష్‌బాబు, వి.మురళి తదితరులు పాల్గొన్నారు.

రేపు గ్రూపు–2 పరీక్షలపై ఉచిత అవగాహన

కొల్లిపర: ఏపీపీఎస్సీ గ్రూపు–2 అభ్యర్థులకు బుధవారం తెనాలి ఎన్‌జీఓ కల్యాణ మండపంలో యూటీఎఫ్, జనవిజ్ఞాన వేదిక, ప్రజాతంత్ర యువజన సంఘం, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కుర్రా కేదార్‌నాథ్ తెలిపారు. సోమవారం యూటీఎఫ్ మండల కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పాల్గొంటారని, ఉచితంగా 120 పేజీల పరీక్ష మెటీరియల్ అందించటం జరుతుందన్నారు. ఈ సదస్సు సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఈ కార్యక్రమానికి వచ్చి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పి.శివశంకర్, ప్రధానకార్యదర్శి కాలేషావలి, కోశాధికారి వహాబ్ గౌరవాధ్యక్షులు రామకృష్ణప్రసాద్, వరప్రతాప్‌కుమార్, మృత్యుంజయరావు పాల్గొన్నారు.

నేడు కేంద్రియ విద్యాలయ వార్షికోత్సవం

తెనాలి: పట్టణంలోని జగ్గడిగుంటపాలెంలోని కేంద్రియ విద్యాలయ 6వ వార్షికోత్సవం, గ్రాండ్ పేరెంట్స్ డే మంగళవారం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే వేడుకల్లో తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. జాతీయ జెండా ఆవిష్కరణ, మార్చ్ ఫాస్ట్, క్రీడాపోటీలు ఉంటాయని ప్రిన్సిపల్ తెలియజేశారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.40/2017 in O.S. 5/2012

Bet :
G. Venkateswara Rao S/o Subba Rao, R/o Jyothi Nagar, NTPC, Ramagundam Mandal - **DHR**
and
1) **Mandava alias Manda Subba** Rao S/o Raghavaih
2) **Mandava Rama Devi**
3) **Mandava Srikanth** @ Sai Kanth
4) **Mandava Soundarya**
Kolluru Village - **JDR's**

పై నెంబరు ఇ.పి.లో డిక్రీబాకీ వసూలు నిమిత్తం జె.డి.ఆర్స్ యొక్క ఈ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టువారిచే ది.18-1-2024వ తేదీ ఉదయం 10.30 గంటలకు లగాయతు వేలం వేయబడును. కావలసినవారు శ్రీకోర్టువారి ఎదుట హాజరై వేలం పాటలో పాల్గొనవచ్చును.

షెడ్యూలు

Guntur dist Kolluru Sub Dist & Mandal Kolluru Gram Panchayat area, Kolluru Village (Tallapaneni vari Street) D.No. 1025, Extent 168.66 Sq. Yard of site with daba house etc There in bearing Door No. 5-111, bounded by. **East:** Panchayat Bazar 23-0, **South:** Manda Raghavaiah Property 65 ft., **West:** 1/2 yd. width eaves water site by the side wall of Polavarapu Nagaiah-23 ft., **North:** 1/2 yd. width eaves water site by the side wall of Sajja Janakiramaiah -57 ft. with in these fourboundaries an extent of 168-66 sq.yds (by measurement) of site with
DHR Value Rs. 6,00,000/-
Amina Value Rs. 20,00,000/-
Sale Date: 18-1-2024
F.Hg: 25-1-2024

నోట్: 1) ఇ.సి. దాఖలా 8వ కాలం ప్రకారం జెడిఆర్‌కు Gift Settlment ద్వారా Dock No. 1235/2006 Kolluru SRO వచ్చియున్నది.
2) ఇ.సి. దాఖలా 2వ కాలం ప్రకారం జెడిఆర్ మండవ సుబ్బారావు గారు అతని అడ్వకేటు అయిన గళ్ళా శ్రీనివాసరావు గారికి Dock 207/2019 Kolluru SRO లో సేల్‌డీడ్ జరిగి వున్నది.
నోట్: శ్రీకోర్టువారు సదరు ఆస్తిని 2017వ సం॥లో జప్తు చేసియున్నారు. సదరు ఇ.సి. దాఖలా 2వ కాలంకు లోబడవలసినది లేదు.

ఆర్ సుబ్బారావు, అడ్వకేట్ ఫర్ డిహెచ్ఆర్ తెనాలి. సెల్: 9885825675

ధాన్యం కాటాలో మోసం.. రైతుల ఆందోళన

పొన్నూరు: వేబ్రిడ్జి తూకంలో మోసం చేస్తూ ధాన్యం కొనుగోళ్లలో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపిస్తూ మండలంలోని మన్నవ గ్రామ రైతులు సోమవారం ఆందోళన చేశారు. ప్రతి రోజు ధాన్యాన్ని తూకం వేసే క్రమంలో భారీస్థాయిలో మోసానికి పాల్పడుతున్నారంటూ రాస్తారోకో నిర్వహించారు. మండలంలోని కట్టెంపూడిలో వేబ్రిడ్జి నిర్వాహకులు కొందరు రైసుమిల్లుల వారితో కుమ్మక్కై మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మండలంలో ధాన్యం కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి. ధాన్యం లారీలు, ట్రాక్టర్లు బారుల తీరడంతో హడావుడిగా ధాన్యం కాటా వేసి రసీదులు ఇచ్చి పంపిస్తున్నారు. తర్వాత రైతులు ధాన్యాన్ని తీసుకువెళ్లి రైసుమిల్లులో విక్రయించాల్సి ఉంది. ఈ క్రమంలో మన్నవ గ్రామ రైతులకు చెందిన లారీ తూకంలో 11 క్వింటాళ్ల తేడా చూపించారు. మరో ట్రాక్టర్‌లో నాలుగున్నర క్వింటాళ్ల తేడా చూపించడంతో పసిగట్టిన రైతులు వేబ్రిడ్జి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. సమాచారం తెలుసుకున్న తూనికల అధికారులు, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. రైతుల ఫిర్యాదు మేరకు శ్రీ లక్ష్మీ శ్రీనివాస వేబ్రిడ్జిలో తనిఖీలు చేయగా, తూకంలో తేడాను గుర్తించినట్లు తూనికల కొలతల జిల్లా అధికారి కొండారెడ్డి తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా

నేటి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని 11, 38 వార్డులలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ వార్డు రామలింగేశ్వరపేట సచివాలయం వద్ద ఉదయం 11 గంటలకు, 38వ వార్డు నెహ్రూ రోడ్డు సచివాలయం వద్ద మధ్యాహ్నం 3గంటలకు సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాల బోర్డులను ఆవిష్కరించనున్నామని, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని తెలిపారు.

గ్యార్మీ జెండా మహోత్సవం



తెనాలిఅర్బన్: హజరత్ మాబు సుభానీ గ్యార్మీ జెండా మహోత్సవాన్ని ఆదివారం రాత్రి మార్కెట్‌లోని జెండా చెట్టు వద్ద ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండాకు దువా చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ గపూర్, షేక్ అక్బర్, బైనా శివసాయి, బైనా శ్రీను, షేక్ జాకీరా, కొల్లూరు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టి



తెనాలిటౌన్: పట్టణంలోని బాలాజీరావుపేటలోని అయ్యప్పస్వామి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్టిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి దుర్భహరిబాబు స్వామి పర్యవేక్షణలో దేవాలయంలో హోమ గుండం ఏర్పాటు చేశారు. అయ్యప్పస్వామి మాలధారులు నిపులపై నడిచారు. అనంతరం స్వామికి విశేష అభిషేకాలు జరిపారు. రైల్వేస్టేషన్ నుంచి అయ్యప్పపురం వరకు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. వివిధ వేషధారణలతో ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నసంతర్పణ చేశారు.

ముగిసిన సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు

తెనాలిరూరల్: పెదరావూరు గ్రామంలోని మహా విద్యా పీఠంలో జరుగుతున్న జగద్గురు ఆదిశంకరాచార్య, అభయ హస్త సుబ్రహ్మణ్యస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. విద్యాపీఠం వ్యవస్థాపకుడు చింతపల్లి సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఈ నెల 14న నుంచి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ముగింపు రోజు శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అత్యాచారాలపై పరిశోధన



తెనాలిటౌన్: కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి మహిళలపై జరిగే అత్యాచారాలపై పరిశోధన చేశారు. తాడేపల్లిగూడెంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో జరుగుతున్న ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాల్లో పరిశోధన పత్రాలను పర్యవేక్షకుడు శ్రీనివాస వాసుదేవ్‌కు సమర్పించారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, కారణాలు, పరిష్కార మార్గాలు, విశ్లేషణ అనే అంశంపై పరిశోధన చేసినట్లు ప్రజ్ఞాచారి తెలిపారు. ఈ పరిశోధన జాతీయస్థాయికి ఎంపికైనట్లు చెప్పారు.

తుపాను బాధితులను ఆదుకోవాలి

తెనాలి: మిచాంగ్ తుపానుతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాటిబండ్ల రామకృష్ణ అన్నారు. రైతుల ధాన్యాన్ని ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన సమావేశంలో సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మకు వినతిపత్రం అందజేశారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కఠారి వాసుదేవనాయుడు, రత్నరాజు, మైల హరికృష్ణ, యోగానందకిషోర్ తదితరులున్నారు.

కర్రసాముతో మహిళలకు రక్షణ

నగరంపాలెం: ఇటీవల జరిగిన నాలుగో జాతీయ ట్రెడిషనల్ శిలంబం చాంపియన్– 2023 పోటీలు విజయవాడలో జరిగాయి. జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో 20 బంగారు పతకాలు, 7 సిల్వర్ మెడల్స్, 7 బ్రాంచ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థుల్ని సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలోని తన కార్యాయలంలో ఏఎస్పీ కె.సుప్రజ అభినందించారు. గురువులు కిరణ్, శ్రీనివాసరావు, కర్రసాము క్రీడ జిల్లా చైర్మన్ ముంజంపల్లి శివకుమార్ పాల్గొన్నారు.